సాక్షి తిరుపతి

మంగళవారం ၊ 1 ၊ ఆగస్టు ၊ 2023



బోల్తా కొట్టిన బొలేరో

బొలేరో వాహనం అదుపు తప్పి పొలాల్లోకి వెళ్లి బోల్తా కొట్టిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది.

- 8లో



దేశం గర్వించే స్థాయికి ఎదగాలి

క్రీడాకారులు దేశం గర్వించే స్థాయికి ఎదగాలని తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు.

- 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	37	27
చిత్తూరు	36	26
తిరుమల	31	22
గూడూరు	37	28
నగరి	37	27

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో శ్రీవారిని ఆదివారం అర్ధరాత్రి వరకు 85,258 మంది దర్శించుకోగా, 25,451 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.28 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా, దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

10 నుంచి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ డీకే బాలాజీ

తిరుపతి అర్బన్: నులిపురుగుల నిర్మూలనకు అల్బెండజోల్ మాత్రలను ఈనెల 10వ తేదీ నుంచి పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. ఆ మేరకు ఆయన కలెక్టరేట్ వద్ద సోమవారం నులిపురుగుల నిర్మూలన పోస్టర్‌ను ఆవిష్కరించారు. జేసీ మాట్లాడుతూ నులిపురుగులను నిర్మూలించేందుకు ఈ నెల 10–17వ తేదీ వరకు వైద్య ఆరోగ్య శాఖ, రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమంగా నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని ఏడాది నుంచి 19 ఏళ్ల వారికి అల్బెండజోల్ మాత్రలు అందించాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 2–19 ఏళ్ల పిల్లలకు 400 ఎంజీ ఆల్బెండజోల్ 1–2 ఏళ్ల పిల్లలకు ఆల్బెండజోల్ 200 ఎంజీ మాత్రలు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు వివరించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతోపాటు కళాశాలల, అంగన్‌వాడీ పిల్లలకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీహరి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి శాంతా కుమారి, డీపీఓ రాజశేఖర రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికం సంఘం నిధులు రూ.10.49 కోట్ల విడుదల

తిరుపతి అర్బన్: జిల్లాలో ఎన్నికలు జరిగిన 745 గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు 2022–23 సంవత్సరానికి సంబంధించి మొదటి విడతగా రూ.10,49,70,288 ప్రభుత్వం నుంచి నేరుగా గ్రామ పంచాయతీ యూనియన్ బ్యాంక్ ఖాతాకు జమ చేశారని జిల్లా పంచాయతీ అధికారి ఏ.రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ అందులో టైడ్ గ్రాంటుకు రూ.9,76,33,938, అన్‌టైడ్ (బేసిక్) గ్రాంటు రూ.73,36,350 విడుదల చేశారని వెల్లడించారు. గ్రామీణాభివృద్ధి ఉత్తర్వుల మేరకు టైడ్ గ్రాండ్‌లో 50శాతం నిధులు పారిశుధ్యానికి మరో 50శాతం నిధులు తగునీరు, వర్షపు నీటి నిల్వ, నీటి సంరక్షణకు వినియోగించాలని స్పష్టం చేశారు.

శివలింగం కళ్లు తెరిచిందంటూ వదంతులు



శ్రీకాళహస్తి: పట్టణంలో శివలింగం కళ్లు తెరిచిందంటూ వదంతులు వ్యాపించాయి. ఈటీసీ కేంద్రం సమీపంలోని శివాలయంలో సోమవారం శివలింగానికి విభూతి పొడలుగా ఉండడంతో కొంతమంది భక్తులు శివలింగం కళ్లు తెరిచిందని వదంతులు వ్యాపింపచేశారు. దీంతో జనాలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. రెండవ పట్టణ పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు.

టేక్ హోం రేషన్

- పకడ్బందీగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం
- గర్భిణులు, బాలింతలకు ఇంటి వద్దకే సరుకులు
- ఆగస్టు 2 నుంచి పంపిణీ
- అంగన్‌వాడీ కేంద్రాలకు చేరుకుంటున్న కిట్లు
- బ్యాగ్‌లో 10 రకాల సరుకులు

తిరుపతి అర్బన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని విభాగాల్లోనూ విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. గర్భవతులు, బాలింతలు అంగన్‌వాడీ పాఠశాలలకు వెళ్లి పడిగాపులు కాయకుండా నేరుగా ఓ కిట్ ద్వారా 10 రకాల సరుకులను నెలకు రెండు సార్లు ఇంటికే చేర్చేలా ఏర్పాట్లు చేపట్టింది. ఈ కార్యక్రమాన్ని ఆగస్టు 2వ తేదీ నుంచి అమల్లోకి తీసుకొచ్చేందుకు సర్వం సిద్ధం చేసింది. జిల్లాలోని 34 మండలాల పరిధిలో



అంగన్‌వాడీ కేంద్రాలకు తరలిస్తున్న టేక్‌హోం రేషన్ సరుకులు

మెయిన్ అంగన్‌వాడీ సెంటర్లు 2,131, మినీ అంగన్‌వాడీ సెంటర్లు 361 ఉండగా.. ఆయా సెంటర్లకు 15 కేజీల బ్యాగ్‌లో 10 రకాల వస్తువులు కల్గిన కిట్లు పంపిణీ చేస్తోంది.

గతంలో అలా..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గర్భవతులు, బాలింతలు అంగన్‌వాడీ సెంటర్ల వద్ద పడిగాపులు కాసేవారు. అంగన్‌వాడీ కేంద్రం దూరమైనా..భారమైనా అన్నీ భరించేవారు. పిల్లలను ఇళ్ల వద్ద వదిలి బాలింతలు అగచాట్లు పడేవారు. ఇక నెలలు నిండిన గర్భవతులు కేంద్రాలకు చేరుకోలేక అవస్థలు పడేవారు. అరకొర ఇచ్చే సరుకుల నాణ్యత, తూకాల్లోనూ తేడా ఉన్నా ఎవరూ పట్టించుకునే వారు కాదు.

ఇప్పుడు ఇలా..

బాలింతలు, గర్భవతులు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఇళ్లవద్దకే 10 రకాల నాణ్యమైన సరుకులు అందించేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చింది. అంతేగాక సెల్‌ఫోన్లలో ఓ యాప్‌ను క్రియేట్ చేసి లబ్ధిదారులు సరుకులు తీసుకున్నారో..లేదో తెలిసే విధంగా ఫొటోలు అప్‌లోడ్ చేసేలా చర్యలు చేపట్టింది. ఇక సరుకుల నాణ్యత.. తూకంలో రాజీపడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పింది.

జిల్లా సమాచారం	
మండలాలు 34	ఐసీడీఎస్ ప్రాజెక్టులు 12
అంగన్‌వాడీ కేంద్రాలు 2,492	గర్భిణులు 12,538
బాలింతలు 12,290	పిల్లలు 1,06,373
అంగన్‌వాడీ టీచర్లు 2,482	



అంగన్‌వాడీ స్కూల్‌లో పిల్లలకు వడ్డించిన భోజనం



పంపిణీ చేసే సరుకులు

రైస్ 3 కేజీలు	కందిపప్పు 1 కేజీ	కోడిగుడ్లు 13	అటుకులు 1 కేజీ
రాగిపిండి 1 కేజీ	పామ్‌ఆయిల్ 500 ఎంఎల్	పాలు 2.5 లీటర్లు	బెల్లం 250 గ్రాములు
వేరుశనగ చిక్కీ 250 గ్రాములు	ఎండు ఖర్జూరం 250 గ్రాములు		





పారదర్శకంగా పంపిణీ

వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా టేక్‌హోంరేషన్ కార్యక్రమాన్ని పారదర్శకంగా అమలు చేసేందుకు ఏర్పాట్లు పూర్తిచేశాం. గర్భిణులు, బాలింతలకు 15 కిలోల బ్యాగ్‌లో 10 రకాల నాణ్యమైన సరుకును నెలకు రెండు సార్లు పంపిణీ చేస్తాం. తూకాల విషయంలో కచ్చితత్వాన్ని అనుసరిస్తున్నాం. 30 గుడ్లు బరువు 1,500 గ్రాములు ఉండేలా ఆదేశాలిచ్చాం. అంగన్‌వాడీ కార్యకర్తలు ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలి.. లేదంటే చర్యలు తప్పవు.

– జయలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ జిల్లా అధికారి

3 నుంచి పురుషోత్తమ మాస మహోత్సవం



మాట్లాడుతున్న శ్రీ ఝులారియా పీఠాధిపతి ఘన్‌శ్యామాచార్యజీ మహరాజ్

తిరుపతి కల్చరల్: ప్రపంచ శాంతితోపాటు మానవాళి సంక్షేమాన్ని కాంక్షిస్తూ ఈనెల 3 నుంచి తిరుపతిలో శ్రీపురుషోత్తమ మాస మహోత్సవ మహాయజ్ఞం నిర్వహించనున్నారు. రాజస్థాన్‌లోని రామానుజ సంప్రదాయానికి చెందిన శ్రీ శ్రీఝులారియా పీఠం వారి ఆధ్వర్యంలో ఈ యజ్ఞం నిర్వహించనున్నట్లు ఆ పీఠాధిపతి స్వామీజీ ఘన్‌షాయామాచార్యజీ మహరాజ్ తెలిపారు. నగరంలోని డీబీఆర్ రోడ్డులో సోమవారం ఆయన శ్రీపురుషోత్తమ మాస మహోత్సవం కుటీరం వద్ద మీడియా సమావేశంలో మాట్లాడారు. ఝులారియా పీఠం ఆధ్వర్యంలో వందకంటే పైగా ఆశ్రమాలు, గోశాల, ధర్మశాలలు, వేద విద్యాలయాలు, సంస్కృత పాఠశాలలు ద్వారా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కలియుగ వైకుంఠుడు శ్రీవారి పాదాల చెంత శ్రీపురుషోత్తమ మాస మహోత్సవ మహాయజ్ఞం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ మహాయజ్ఞం ప్రారంభం సందర్భంగా తొలి రోజు ఆగస్టు 3వ తేదీ ఉదయం 8 గంటలకు తిరుచానూరు రోడ్డులోని రామానాయుడు కల్యాణ మండపం నుంచి వివిధ రాష్ట్రాలకు చెందిన స్వామీజీలు, వందలాది మంది భక్తులతో ఉత్సవాల మండపం వరకు ర్యాలీ చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం 9వ తేదీ వరకు ప్రతి రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉత్సవ మండపంలో ప్రత్యేక హోమాలు, సహస్ర కలశాభిషేకం, శ్రీలక్షాచారణ మహోత్సవం, 225 కుండలాలతో శ్రీమహాలక్ష్మీయాగం వంటి క్రతులను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీపురుషోత్తమ మాస మహోత్సవ యజ్ఞ మండపాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శ్రీపురుషోత్తమ మాస మహోత్సవ సమితి సమన్వయకర్త డాక్టర్ నవీన్ మహేశ్వరి, ప్రతినిధులు పాల్గొన్నారు.

త్వరలోనే కుప్పానికి సాగు..తాగునీరు



మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి , పక్కన జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

- సీఎం వైఎస్ జగన్ చేతులమీదుగా ప్రారంభిస్తాం
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టీకరణ
- పుంగనూరులో రూ.62 కోట్ల పనులకు శంకుస్థాపన

పుంగనూరు : జిల్లాలోని పడమటి నియోజకవర్గాలకు గండికోట జలాలను తరలించేందుకు శరవేగంగా పనులు పూర్తి చేస్తున్నట్లు మంత్రి పెద్దిరెడి రామచంద్రారెడ్డి తెలిపారు. త్వరలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా కుప్పం నియోజకవర్గానికి సాగు, తాగునీరు అందించనున్నట్లు వెల్లడించారు. సోమవారం పుంగనూరులో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపన చేశారు. పట్టణ సుందరీకరణలో భాగంగా రూ.41కోట్లతో ఎంబీటీ రోడ్డు విస్తరణ, రూ.22కోట్లతో కొండిన్య కాలువల్లో పూడిక తీసి సిమెంట్ కాలువల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. అనంతరం జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులుతో కలిసి మీడియాతో మాట్లాడారు. పుంగనూరులో సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు నుంచి రూ.13 కోట్లతో పైపులైన్లు వేసి, ఓవర్ హెడ్ ట్యాంకులకు నీటిని తరలిస్తామన్నారు. నెడ్‌క్యాప్ ద్వారా 5మెగా వాట్ల సోలార్ ప్రాజెక్టును సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు వద్ద ఏర్పాటు చేసి, మున్సిపాలిటీకి విద్యుత్ సరఫరా చేయనున్నట్లు వివరించారు. దీంతో మున్సిపాలిటీకి ఏటా రూ. 4కోట్లు ఆదా అవుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పుంగనూరుపై ప్రత్యేక అభిమానంతో కోట్లాది రూపాయలు మంజూరు చేశారని వెల్లడించారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసినా చంద్రబాబు కుప్పానికి తాగునీరు అందించడంలో విఫలమయ్యారని విమర్శించారు. నాలుగున్నరేళ్లలోనే సీఎం వైఎస్ జగన్ చిత్తశుద్ధితో కృషి చేసి హంద్రీ–నీవా పనులను పూర్తి చేయిస్తున్నారని వెల్లడించారు. మారుమూల గ్రామాలకు సైతం గండికోట జలాలను తీసుకెళతామని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం పాల్గొన్నారు.

పేదల జోలికి వస్తే సహించం

పట్టణంలోని నక్కబండలో సోమవారం నిర్వహించిన వార్డు బాటలో మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ ఎవరైనా సరే పేదల జోలికి వెళ్లితే సహించేది లేదని తెలిపారు. నక్కబండకు త్వరలోనే డబుల్ రోడ్డును వేయిస్తామని, దొంగ పట్టాలపై విచారణ చేయిస్తామని భరోసా ఇచ్చారు. సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణం కోసం రూ.8.34 కోట్లు కేటాయించామన్నారు. ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పేవారిని నమ్మవద్దని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ కార్యాలయాలకు రక్షణ కవచం

వరదయ్యపాళెం: మండలంలోని ఇందిరానగర్ పంచాయతీలో 15 ఏళ్ల క్రితం నిర్మించిన ప్రభుత్వ కార్యాలయాల సముదాయానికి రక్షణ కవచానికి శ్రీకారం చుట్టారు. స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చొరవతో మండల పరిషత్ అధ్యక్షురాలు పద్మప్రియ ప్రహరీ గోడ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కార్యాలయాల ఆవరణ రాత్రి పూట మందుబాబులకు అడ్డాగా మారింది. దీంతోపాటు ఎదురుగా శ్మశాన వాటిక ఉండడంతో అధికారులు కాస్త ఇబ్బందులకు గురయ్యేవారు. ఈ క్రమంలోనే నిధులు విడుదల ఆలస్యమైనా, ఎంపీపీ ప్రత్యేక చొరవ తీసుకుని ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టారు. అయితే ఈ ప్రహరీ గోడ నిర్మాణం వల్ల దారి సమస్య ఏర్పడుతోందంటూ ఈనాడు ప్రభుత్వంపై బురదజల్లుతోంది. తేదేపా నేతపై కక్షతో నిధులు రాకుండానే ప్రహరీ నిర్మాణం అంటూ నిస్సిగ్గుగా అబద్ధాలు అల్లేసింది. వాస్తవంగా ప్రహరీ గోడ నిర్మాణం వల్ల అవతలివైపు తాజాగా నిర్మించుకున్న ఇళ్లకు ఇందిరాకాలనీ నుంచి 20 అడుగుల దారి ఉంది. అంతేకాకుండా ప్రస్తుతం నిర్మించిన ప్రభుత్వ కార్యాలయాల ప్రహరీ గోడకు, జూనియర్ కళాశాల ప్రహరీకి మధ్యలో జూనియర్ కళాశాలకు వెళ్లే రోడ్డుకు అనుసంధానంగా మరో 10 అడుగుల రోడ్డును స్థానికుల రాకపోకలకు కేటాయించారు. తద్వారా ప్రభుత్వ కార్యాలయాలకు దక్షిణవైపు ఉన్న పద్మావతిపురంవాసులకు ప్రహరీ గోడ నిర్మాణం వల్ల ఎలాంటి ఇబ్బందులు లేవని ఎంపీడీవో సుబ్రమణ్యం రాజు స్పష్టం చేశారు.



ప్రభుత్వ కార్యాలయాలకు ఆనుకుని పద్మావతిపురం వెళ్లే దారి

దొంగోట్ల పేటెంట్ హక్కు చంద్రబాబుదే



పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

- సాధికారత సర్వే పేరుతో డేటా చోరీ చేసింది లోకేష్, బాబులే
- తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి

తిరుపతి మంగళం : అబద్దాలు, అక్రమాలు, దొంగ ఓట్లు, వంటి తప్పుడు పనులు చేయడంలో చంద్రబాబుకు పేటెంట్ హక్కు ఉందని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి విమర్శించారు. తిరుపతి 19వ డివిజన్, ముత్యాలరెడ్డి పల్లిలో సోమవారం కార్పొరేటర్ ఆరణి సంధ్య ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, మేయర్ డాక్టర్ శిరీషతో కలిసి నిర్వహించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ, వైఎస్సార్ సీపీ దొంగోట్లను చేరుస్తోందంటూ చంద్రబాబు చేసిన విమర్శలను ఖండించారు. చంద్రబాబు పాలనలో ఐటీ మంత్రిగా లోకేష్‌ని పెట్టి సాధికారత సర్వే పేరుతో సుమారు 65 లక్షల దొంగ ఓట్లను చేర్పించిన దొంగలు మీరు కాదా? అని ప్రశ్నించారు. చంద్రబాబు దొంగోట్ల నిర్వాకాన్ని గుర్తించిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, నేరుగా కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారని గుర్తుచేశారు. అప్పుడే ఎన్నికల స్పందించి, 40 లక్షల మేరకు దొంగ ఓట్లు తొలగించిందని చెప్పారు. జగన్ మోహన్ రెడ్డి మీద దొంగోట్ల నింద వేయాలని ఒక వైపు చంద్రబాబు, మరోవైపు దత్త పుత్రుడు పవన్ కల్యాణ్, ఇంకో వైపున ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. అయితే దీన్ని నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని స్పష్టం చేశారు.

చరిత్ర సృష్టించిన సీఎం జగన్

దేశ చరిత్రలోనే ఎవరూ అందించలేని విధంగా సంక్షేమ పథకాల ద్వారా రూ. 3.35 లక్షల కోట్లను నేరుగా ప్రజలకు అందించిన సీఎం వైఎస్ జగన్ చరిత్ర సృష్టించారని ఎమ్మెల్యే చెప్పారు. ఇది జీర్ణించుకోలేని ప్రతిపక్ష నాయకులు వలంటీర్ల వ్యవస్థను నాశనం చేసేందుకు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. జగనన్న చేసిన మేలును ప్రజలంతా గుండెల్లో పెట్టుకున్నారని తెలిపారు.

కిటకిటలాడిన దో షాహీద్ దర్గా

ఘనంగా రొట్టెల పండుగ

చిల్లకూరు: మొహర్రం పండుగ ఆరంభమై మూడో రోజు సందర్భంగా మండల కేంద్రంలోని దో షాహీద్ దర్గాలో భక్తులతో కిటకిటలాడింది. మొహర్రంను పరస్కరించుకుని నెల్లూరులోని బారా షాహీద్ దర్గా వద్ద రొట్టెల పండుగ నిర్వహించడం ఆనవాయితీ. ఇదే క్రమంలో సోమవారం జరిగిన రొట్టెల పండుగలో సయ్యద్ మహ్మద్ షా, సయ్యద్ అహ్మద్ షాల సమాధులను వందల సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. గూడూరు డివిజన్‌లోని పలు మండలాలకు చెందిన హిందు, ముస్లింలు దర్గాలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్గాలను దర్శించుకుని బూందీని సమర్పించి రొట్టెలను వదిలితే కోరుకున్న కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. కోరిక నెరవేరిన తరువాత వచ్చే ఏడాది వారు ఇక్కడకు వచ్చి తిరిగి ఆ పేరుతో రొట్టెలను వదిలారు. అనంతరం ఇక్కడ ముస్లిం, హిందువుల మహిళలు ఇచ్చుకుంటినమ్మ వాయినం, పుచ్చుకుంటినమ్మ వాయినం అంటూ రొట్టెలను అందించుకున్నారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే సయ్యద్ అహ్మద్‌షా, సయ్యద్ మహ్మద్ షా సమాధులను హిందు, ముస్లింలు అనే తేడా లేకుండా దర్శించుకుంటున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్గా నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ముతవల్లి జుబేద్ భక్తులకు ప్రసాదాలను అందించారు.





రొట్టెలు మార్చుకుంటున్న మహిళలు(ఇన్‌సెట్) దర్గాను దర్శించుకుని ఆశీర్వచనాలు తీసుకుంటున్న భక్తులు

స్పందనకు 127 అర్జీలు

తిరుపతి అర్బన్: : జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 127 అర్జీలు వచ్చినట్లు జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. జేసీ మాట్లాడుతూ తాగునీటి సమస్యలు, వీధిలైట్లు, పారిశుధ్య వసతులకు సంబంధించిన అర్జీలకు వెంటనే పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. డక్కిలి మండలంలోని కాంపాలి ఎస్టీ కాలనీలోని పలు పొదుపు సంఘాలకు చెందిన గ్రూపు సభ్యులు పొదుపు అధికారులు తమ డబ్బులు స్వాహా చేశారని డీఆర్‌డీఏకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శ్రీనివాసులు, భాస్కర్‌నాయుడు, ఏవో జయరాములు పాల్గొన్నారు.

శాఖల వారీగా అర్జీల వివరాలు

రెవెన్యూ శాఖకు 86, హౌసింగ్ 11, పోలీస్ శాఖ 6, నీటిపారుదల శాఖ 4, జిల్లా పంచాయతీ అధికారి 3, మునిసిపల్ కమిషనర్ 3, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ 2, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ 2, విబిన్న ప్రతిభావంతుల శాఖ 2, జిల్లా పౌరసరఫరాల శాఖ 1, విద్యుత్ శాఖ 1, దేవదాయ శాఖ 1, డీఆర్‌డీఏ 2, మండల పరిషత్ 1, చేనేత మరియు జౌళి శాఖ 1, పరిశ్రమల శాఖ –1

భూ సమస్యకు పరిష్కారం

ఏర్పేడు: మండలంలోని చింతలపాలెం రెవెన్యూలోని ఎస్సీలు, షికారీల మధ్య ఏళ్ల తరబడి నెలకొన్న 536 ఎకరాల డీకేటీ భూముల సమస్య జేసీ డీకేబాలాజీ సమక్షంలో పరిష్కారమైంది. ఎస్సీలు అపర్ణాదేవి, పెంచలమ్మ, చెంగయ్య, సుబ్బమ్మ, మంగమ్మ, శంకరమ్మ, కొల్లేటి పెంచలమ్మ, మణి, చంద్రయ్య, సంపూర్ణ, పెంచలయ్యకు చెందిన 21.05 ఎకరాలను సాగు చేసుకునేందుకు ఇరు వర్గాలు ఒప్పందం కుదుర్చుకున్నాయి.



బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.61,330
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.5,508
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.75,700
రిటైల్ వెండి గ్రాము రూ.77.70

గంగకాలువలో వ్యక్తి గల్లంతు


గాలిస్తున్న అగ్నిమాపకశాఖ అధికారులు

వెంకటగిరిరూరల్ : తెలుగుగంగ కాలువలోకి దిగిన వ్యక్తి నీటి ఉధృతికి కొట్టుకుపోయిన సంఘటన బంగారుపేట వంతెన వద్ద సోమవారం చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు తిరుపతి జీవకోన ప్రాంతానికి చెందిన షేక్ ఆలీ(37) ఏడుగురు కుటుంబ సభ్యులతో ఆటోలో నెల్లూరులో జరుగుతున్న రొట్టెల పండుగకు బయలుదేరారు. బంగారుపేట తెలుగుగంగ కాలువ వద్దకు వచ్చేసరికే విశ్రాంతి తీసుకునేందుకు ఆటోను ఆపారు. ఈ క్రమంలో ఆలీ కాలకృత్యాలు తీర్చుకునేందుకు తెలుగుగంగ కాలువలోకి దిగి నీటి ప్రవాహానికి కొట్టుకుపోయారు. ఇది గమనించిన బంధువులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆలీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

దేశం గర్వించే స్థాయికి ఎదగాలి


అండర్ -19 చాంపియన్ షిప్ విజేతలతో ఎస్పీ పరమేశ్వర రెడ్డి


స్టేట్ బ్యాడ్మింటన్ అండర్ -19 విజేతలతో అసోసియేషన్ సభ్యులు

- తిరుపతి ఎస్పీ పరమేశ్వర రెడ్డి
- ముగిసిన రాష్ట్ర బ్యాడ్మింటన్ అండర్-19 పోటీలు

తిరుపతి సిటీ : అంతర్జాతీయ స్థాయిలో రాణించి దేశం గర్వించే క్రీడాకారులుగా ఎదగాలని తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి పిలుపు నిచ్చారు. తిరుపతి శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ వేదికగా ఇండోర్ స్టేడియంలో ఈ నెల 28వ తేదీన ప్రారంభమైన స్టేట్ జూనియర్ బ్యాడ్మింటన్ అండర్-19 పోటీలు సోమవారం ముగిశాయి. దీనికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై విజేతలకు ట్రోఫీ, ధ్రువపత్రాలను అందజేసి అభినందించారు. ఆయన మాట్లాడుతూ మంచి క్రీడాకారులుగా రాణించేందుకు యువతకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తోందన్నారు. అవకాశాలను యువత అందిపుచ్చుకుని నిత్య సాధనతో తమ లక్ష్యాన్ని చేరుకోవాలని కోరారు. టోర్నమెంట్‌ను దిగ్విజయం చేసిన నిర్వాహకులను ఆయన అభినందించారు. ప్రతిష్టాత్మకంగా తీసుకుని చాంపియన్ షిప్‌ను నిర్వహించినట్లు, క్రీడాకారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేశామని ఆర్గనైజింగ్ సెక్రటరీ రామకృష్ణయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు సత్యనారాయణ, అధ్యక్షుడు ఆనందరెడ్డి, ఏపీ బ్యాడ్మింటన్ అసోసియషన్ సెక్రటరీ అంకమ చౌదరి, సభ్యులు, కోచ్‌లు, రెఫరీలు పాల్గొన్నారు.

విజేతలు

- మహిళల సింగిల్స్ విభాగంలో కాకినాడ జిల్లాకు చెందిన టి సూర్య చరిష్మ విజేతగా, రష్మిత రన్నరప్‌గా నిలిచింది. పురుషుల సింగిల్స్ విభాగంలో తూర్పుగోదావరి జిల్లాకు చెందిన కె శ్రీమోహిత్ విజేతగా, కాకినాడ జిల్లాకు చెందిన టి హర్షన్ రన్నరప్‌గా నిలిచారు.
- మహిళల డబుల్స్ విభాగంలో టి సూర్య చరిష్మ(కాకినాడ జిల్లా), కే దుర్గా ఇషా(తూర్పుగోదావరి జిల్లా) విజేతలుగా నిలిచారు. రన్నరప్‌గా కందేరి నవ్య(చిత్తూరు జిల్లా), డి రష్మిత(కాకినాడ)నిలిచారు.
- పురుషుల డబుల్స్ విభాగంలో తూర్పు గోదావరి జిల్లాకు చెందిన కె శ్రీమోహిత్, ఎ చరణ్ గణేష్ విజేతలుగా నిలిచారు. రన్నరప్‌గా పి బాలప్రణయ్(విశాఖపట్నం), టి ప్రణవ్ సాయి(చిత్తూరు జిల్లా) నిలిచారు.
- మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో కాకినాడ జిల్లాకు చెందిన టి హర్షన్, డి రష్మిత విజేతలుగా, అనంతపురం జిల్లాకు చెందిన సాకేత్ రామగొణి, శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఎం దీపిక రన్నరప్‌గా నిలిచారు.

గంజాయి రవాణాలో తమిళ విద్యార్థులు


నిందితులను అరెస్టు చూపుతున్న తిరుచానూరు సీఐ శివప్రసాద్ రెడ్డి

తిరుచానూరు (చంద్రగిరి): తిరుపతిలోని ఓ లా కళాశాలలో చదువుతున్న తమిళనాడుకు చెందిన విద్యార్థులు అక్రమంగా గంజాయి రవాణా చేస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. వారి నుంచి 2.1 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు సోమవారం తిరుచానూ రు సీఐ శివప్రసాద్ రెడ్డి వివరాలను వెల్లడించారు. తమిళనాడు నామక్కల్ జిల్లాకు చెందిన దివిన్ సెల్వరాజ్, కన్యాకుమారి జిల్లాకు చెందిన తనూష్ కృష్ణన్ తిరుపతిలోని ఓ లా కళాశాలలో విద్యనభ్యసిస్తున్నారు. వీరు గంజాయి తాగడానికి అలవాటు పడ్డారు. తరువాత సంపాదన కోసం గంజాయి అక్రమ రవాణా చేయడం మొదలుపెట్టారు. జూలై 27వ తేదీన తిరుపతిలోని వారుండే గది నుంచి బయలుదేరి ఇచ్ఛాపురం వెళ్లి అక్కడ చిల్లర దుకాణంలో 2.1 కేజీల గంజాయిని కొనుగోలు చేశారు. అనంతరం ఎవరికి అనుమానం రాకుండా టేప్‌తో ప్యాక్ చేసి, వాళ్ల బ్యాగుల్లో ఉంచుకుని ఆదివారం తిరుపతికి వచ్చారు. ఆదివారం సాయంత్రం చంద్రగిరి–రేణిగుంట హైవేలోని తనపల్లి బస్టాప్ నుంచి గదికి బయల్దేరారు. అప్పటికే సమాచారం అందుకున్న పోలీసులు చంద్రగిరి డీఎస్పీ యశ్వంత్ పర్యవేక్షణలో వారి బ్యాగులను తనిఖీ చేయగా, 2.1కిలోల గంజాయి బయటపడింది. వెంటనే వారిని అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు పంపారు. ఈ కేసును ఛేదించడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన తిరుచానూరు సీఐ శివప్రసాద్ రెడ్డి, ఎస్ఐ వెంకటసుబ్బయ్య, సిబ్బందిముని, మనోహర్, ప్రసాద్‌ను ఎస్పీ పరమేశ్వర రెడ్డి అభినందించి, రివార్డులను ప్రకటించారు.

టిప్పర్ కింద పడి వ్యక్తి మృతి


వెంకటాద్రి మృతదేహన్ని పరిశీలిస్తున్న ఏఎస్ఐ వెంకటేశ్వరావు

రాపూరు: టిప్పర్ కింద పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో సోమవారం చోటుచేకుంది. ఏఎస్ఐ వెంకటేశ్వరావు కథనం మేరకు మండలంలోని సిద్ధవరం ఎస్సీకాలనీలో తెల్లవారుజామున అదే గ్రామానికి చెందిన డ్రైవర్ రమణయ్య తన టిప్పర్‌ను కాలనీలో వెనక్కు తీస్తున్నాడు. ఆ సమయంలో రోడ్డు పక్కన తూముపై కూర్చున్న కుదిపి వెంకటాద్రి (49)కి టిప్పర్ తగిలింది. దీంతో ఆయన రోడ్డుపై పడిపోగా ఆయనపైనుంచి టిప్పర్ వెనుక చక్రాలు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్ రమణయ్యను అదుపులోకి తీసుకున్నారు. వెంకటాద్రి మృతదేహనికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఆయన వివరించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తిరుమలలో నాగుపాముల కలకలం


పట్టుకున్న నాగుపాముతో భాస్కర్ నాయుడు

తిరుమల : తిరుమలలో నాగుపాములు రెండు వేర్వేరు ప్రదేశాల్లో కలకలం సృష్టించిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. టీటీడీ అటవీ ఉద్యోగి భాస్కర్‌నాయుడు తెలిపిన వివరాల మేరకు స్థానిక పీఏసీ-5 నిర్మాణ ప్రదేశంలో ఓ నాగుపాము రావడంతో కార్మికులు అటవీశాఖకు సమాచారం అందించారు. వెంటనే అక్కడకు చేరుకున్న ఆయన చాకచక్యంగా నాగుపామును పట్టుకున్నారు. స్థానిక బాలాజీనగర్ ఐదవలైన్‌లోని ఓ ఇంటిలో నాగుపాము దూరడంతో స్థానికులు అటవీ శాఖకు సమాచారం అందించారు. వెంటనే అక్కడకు చేరుకున్న ఆయన పామును పట్టుకున్నారు. అనంతరం రెండు పాములను అవ్వాచ్చారి కోనలో విడిచిపెట్టారు.

ఎర్రావారిపాళెం ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి


తలకోన చెక్ పోస్టు వద్ద ఆందోళన చేస్తున్న తురకపల్లె గ్రామస్తులు

భాకరాపేట : ఎర్రావారిపాళెం ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని తురకపల్లె గ్రామస్తులు ఆందోళనకు దిగిన సంఘటన సోమవారం సాయంత్రం తలకోన చెక్‌పోస్టు వద్ద చోటుచేసుకుంది. ఎర్రావారిపాళెం మండలం నెరబైలు పంచాయతీ తురకపల్లె గ్రామస్తులు, ఎర్రావారిపాళెం ఎస్ఐ మధ్య జరిగిన గొడవ చినికి చినికి గాలి వానలా మారింది. గ్రామస్తుల కథనం మేరకు, తురకపల్లెకు చెందిన నలుగురు పిల్లలు సరదాగా తలకోన మడుగులో చేపలు పట్టడానికి వెళ్లారు. చేపలు పట్టుకుంటున్న వీరిని పీలేరుకు చెందిన కొందరు యువకులు, టూరిజం శాఖ ఉద్యోగి, మరికొంత మంది కలసి తాగిన మైకంలో చితకబాదారు. దీంతో ఆ పిల్లలు నలుగురు తురకపల్లెకు వచ్చి గ్రామంలో చెప్పారు. గ్రామస్తులు తలకోన చెక్‌పోస్టు వద్దకు చేరుకున్నారు. అక్కడే ఉన్న ఎర్రావారిపాళెం ఎస్ఐ వెంకటేశ్వర్లు మద్యం మత్తులో ఉండి తమను విచక్షణా రహితంగా కొట్టి మోకాళ్లపై నిలబెట్టి నానా దుర్భాషలాడినట్లు చెప్పారు. గ్రామస్తులు మూకుమ్మడిగా తిరగబడడంతో ఎస్ఐ తలకోన వైపు వెళ్లిపోయారు. గ్రామస్తులు ఉన్నత స్థాయి అధికారులకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారులు మంగళవారం ఉదయం వచ్చి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు వెనుదిరిగారు.

రూ. 2.33 కోట్లకు ఐపీ

తిరుపతి లీగల్: తిరుపతి కేబీ లే ఔట్ సుజా రెసిడెన్సీకి చెందిన ఎం.రాజశేఖర్ తిరుపతి అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో 2 కోట్ల 33 లక్షలా 8 వేల రూపాయలకు ఐపీ దాఖలు చేసినట్లు ఆయన తరపు న్యాయవాది ఎస్.శ్రీనివాసులురెడ్డి తెలిపారు. పిటిషన్‌లోని వివరాల మేరకు రాజశేఖర్ 2017 నుంచి తిరుపతిలో బాలాజీ వెజిటబుల్స్ పేరుతో టమాటా వ్యాపారం చేస్తున్నాడు. ఆయన టమాటాలను రైతుల వద్ద కొని చెన్నై, హైదరాబాద్, బెంగళూరుతో పాటు ఇతర ప్రాంతాలకు సరఫరా చేసేవారు. దీంతోపాటు తిరుపతిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహించేవాడు. మరోవైపు వ్యవసాయ భూములను లీజుకు తీసుకొని ఆ భూముల్లో టమాటాలను పండించి ఇతర ప్రాంతాలకు పంపించేవాడు. ఈ వ్యాపారాలు ప్రారంభించడానికి, వ్యాపారాభివృద్ధి కోసం అతను ఇతరుల వద్ద అధిక వడ్డీలకు సొమ్మును అప్పుగా తీసుకున్నాడు. కోవిడ్-19తో టమాటా వ్యాపారంలో తీవ్రంగా నష్టం వచ్చింది. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ప్లాట్స్ కొన్నవారు తిరిగి సొమ్ము చెల్లించక ఆ వ్యాపారంలో కూడా నష్టం వచ్చింది. రుణదాతల నుంచి తీసుకున్న సొమ్ముకు వడ్డీలు పెరగడం, వ్యాపారంలో నష్టాలు రావడంతో తిరిగి వారికి సొమ్ము చెల్లించలేక పోయినట్లు ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు. రుణదాతలకు సొమ్ము చెల్లించలేని స్థితిలో ఈ ఐపీని దాఖలు చేసినట్లు ఆయన పిటీషన్‌లో తెలిపారు. 40 మంది రుణదాతలను ఆయన పిటిషన్‌లో ప్రతివాదులుగా పేర్కొన్నాడు.

శవ రాజకీయాలు వద్దు

- మృతుడు కార్తిక్ తల్లిదండ్రుల వేడుకోలు
- ముగిసిన పోస్టుమార్టం, స్వగ్రామంలో అంత్యక్రియలు


శవ రాజకీయాలు చేయవద్దని వేడుకుంటున్న కార్తిక్ కుటుంబ సభ్యులు

చంద్రగిరి(తిరుపతి రూరల్): స్వర్ణముఖి నదిలోకి ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు మరణించిన తన బిడ్డ కార్తిక్‌ను అడ్డు పెట్టుకుని శవ రాజకీయాలు చేయవద్దని రాజకీయ పార్టీలకు కార్తిక్ తల్లిదండ్రులు సుమలత, శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. తన బిడ్డది ప్రమాదవశాత్తు జరిగిన మరణంగానే తాము భావిస్తున్నట్లు చెప్పారు. తిరుపతిలోని ఎస్వీ మెడికల్ కళాశాల మార్చురీ వద్ద సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. తమ బిడ్డ కార్తిక్(20) రంగంపేటకు సమీపంలోని వెంకట పద్మావతి కళాశాలలో మొదటి సంవత్సరం ఫిజియోథెరపీ కోర్సు చదువుతున్నట్లు చెప్పారు. ఆదివారం సెలవు కావడంతో స్నేహితులతో కలిసి సరదాగా స్వర్ణముఖిలో ఈత కొట్టేందుకు వెళ్లినట్లు కార్తిక్ స్నేహితులు చెప్పారన్నారు. నీటి ఉధృతి ఎక్కువగా ఉండటంతో అరకొరగా ఈత వచ్చిన కార్తిక్ అందులో మునిగి చనిపోయినట్లు చెప్పారు. ప్రమాదవశాత్తు జరిగిన తమ బిడ్డ మరణాన్ని కూడా కొందరు రాజకీయం చేయాలని ప్రయత్నించడం చాలా బాధాకరమని చెప్పారు. ఇప్పటికే బాధల్లో ఉన్నామని, శవ రాజకీయాలు చేసి మరింత బాధపెట్టవద్దని పలు పార్టీల నేతలను కన్నీళ్లతో వేడుకున్నారు. బాధల్లో ఉన్న తమను ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు ఆదుకున్నారని, సాయం చేస్తున్నారని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. పోస్టుమార్టం అనంతరం కార్తిక్ మృతదేహాన్ని కర్నూలుకు అంబులెన్స్ ద్వారా తరలించారు. సాయంత్రం మృతుడికి అంత్యక్రియలు నిర్వహించినట్లు తల్లిదండ్రులు తెలిపారు.

అదుపుతప్పి బోల్తా కొట్టిన బొలేరో


గాయపడిన వారిని తరలిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

నాయుడుపేటటౌన్: అదుపుతప్పిన బొలేరో వాహనం బోల్తా కొట్టి, 8 మంది గాయపడిన సంఘటన మండల పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, సత్యసాయి జిల్లా, తనకల్లు మండలం, పెద్దపల్లెకు చెందిన అక్బర్‌బాషా 8 మంది కుటుంబ సభ్యులతో కలసి బొలేరో వాహనంలో రొట్టెల పండుగకు వచ్చారు. సాయంత్రం నెల్లూరు నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యంలో నాయుడుపేట వద్ద విన్నమాల సమీపంలో జాతీయ రహదారిపై కారు అదుపు తప్పి పొలాల్లోకి వెళ్లి బోల్తా పడింది. దీంతో కారులో ఉన్న అక్బర్ బాషాతోపాటు, కుటుంబ సభ్యులు షేక్ సల్మా, టీ మస్తాన్ బీ, టీ జీలాని సాహెబ్, షేక్ అమీనాబీ, షేక్ ఆస్మద్‌జాన్, ఇద్దరు చిన్నారులు టీ పర్వనా, జీసాన్ గాయపడ్డారు. సమాచారం అందుకున్న హైవే అంబులెన్స్‌తోపాటు 108 సిబ్బంది సంఘటన స్థలం చేరుకుని బొలేరో వాహనంలో ఇరుక్కున్న క్షతగాత్రులను, వెలుపలికి తీసి స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తీవ్రంగా గాయపడిన అక్బర్‌బాషా, ఆస్మద్‌జాన్‌ను తిరుపతికి తరలించారు. మిగిలిన వారిని శ్రీకాళహస్తి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ శ్రీకాంత్ సంఘటన స్థలం వద్దకు వెళ్లి పరిశీలించారు. కారు నడుతున్న డ్రైవర్ నిద్ర మత్తులో ఉండడంతోనే ఈ ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేటి నుంచి ఫార్మేటివ్, సీబీఏ- 1 పరీక్షలు


డీసీఈబీ సెక్రటరీ హేమారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఈ నెల 1 నుంచి 4వ తేదీ వరకు ఫార్మేటివ్, సీబీఏ-1 పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం సెక్రటరీ(డీసీఈబీ) హేమా రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 1 నుంచి 8వ తరగతులకు ఓఎంఆర్ బేస్డ్‌లో, 9, 10 తరగతులకు పాత విధానంలో పరీక్షలు జరుగుతాయన్నారు. కొత్తగా అమలు చేస్తున్న టోఫెల్ పరీక్ష నిర్వహణపై టీచర్లకు అవగాహన కల్పించినట్లు వెల్లడించారు. సీబీఏ విధానాన్ని విద్యార్థులు అర్థం చేసుకునేలా బైలింగ్విల్ (తెలుగు, ఇంగ్లీష్) లో ప్రశ్నపత్రం రూపొందించారన్నారు. ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలోని నిర్వాహకులు ప్రశ్నపత్రాల కోసం 1 నుంచి 5 వ తరగతి వరకు ఒక్కొక్క విద్యార్థికి రూ.150, 6 నుంచి 10 వ తరగతి వరకు రూ.200 చెల్లించాలని సూచించారు. సెక్రటరీ, డీసీఈబీ, చిత్తూరు (ఐఎఫ్ఎస్‌సీ:ఎసీబీఐ000085) పేరుతో డీడీ రూపంలో చెల్లించాలని తెలిపారు.